సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 8 | డిసెంబర్ | 2024



రూ.5లక్షల అప్పివ్వలేదని హత్య

ఈ నెల 2వ తేదీన నగరంలో హత్యకు గురైన బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి రాజమోహన్ హత్య కేసు నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి మీడియాకు వివరాలు వెల్లడించారు. - 8లో



కేఎంటీపీ అభివృద్ధికి కృషి

వరంగల్ జిల్లాలోని కేఎంటీపీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం 28°/21°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురుస్తాయి. రాత్రి సాధారణ వాతావరణం ఉంటుంది. చలి తక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వేసెక్టమీ ఆపరేషన్ సులువైంది : డీఎంహెచ్‌ఓ



హసన్‌పర్తి : అపోహలకు గురికాకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌కు (వేసెక్టమీ) పురుషులు ముందుకు రావాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య పిలుపునిచ్చారు. వేసెక్టమీ అవగాహన, శస్త్ర చికిత్స పక్షోత్సవాల్లో భాగంగా శనివారం హసన్‌పర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కుటుంబ నియంత్రణ ఆపరేషన్ శిబిరాన్ని అప్పయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదటి సంతానం తర్వాత రెండో సంతానానికి కనీసం మూడేళ్లు వ్యవధి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ డాక్టర్ యాకూబ్ పాషా, మాస్ మీడియా అధికారి అశోక్‌రెడ్డి, ఎస్‌ఓ డాక్టర్ ప్రసన్నకుమార్, హెచ్‌ఈఈఓ చంద్రశేఖర్, మాతా, శిశు సంక్షేమ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగరాజు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

లంచం ఇవ్వడమూ నేరమే



వరంగల్ క్రైం : లంచం తీసుకోవడమే కాదు..ఇవ్వడం కూడా నేరమే అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. అవినీతి వ్యతిరేక వారోత్సవాల సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఉన్నత పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన వారికి శనివారం సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈయేడాది లంచం అడిగిన అధికారిని ఏసీబీ అధికారులకు పట్టించడంతోపాటు కోర్టులో సాక్ష్యం చెప్పి శిక్ష పడేలా కృషి చేసిన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ ప్రాంతానికి చెందిన వీరభద్రంను సీపీ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్లు సాట్ల రాజు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్కూల్ ఇన్నోవేషన్' గడువు పొడిగింపు

విద్యారణ్యపురి : స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ప్రతిపాదనలు సమర్పించేందుకు ఈనెల 15వరకు గడువు పొడిగించినట్లు హనుమకొండ డీఈఓ వాసంతి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.శ్రీనివాసస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 282మంది ఉపాధ్యాయులు నమోదు చేసుకోగా వారిలో 152 టీంలు ఏర్పాటు చేశారని, 54శాతం విద్యార్థులను నమోదు చేయించారని పేర్కొన్నారు. ఇందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపించాలని సూచించారు.

సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ టెన్నిస్ టోర్నీకి కేయూ జట్టు



కేయూ క్యాంపస్ : కర్ణాటకలోని మణిపాల్ యూనివర్సిటీలో సోమవారం వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ టోర్నమెంటులో కేయూ (ఉమెన్) జట్టు పాల్గొననున్నట్లు స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శనివారం తెలిపారు. కె.మేఘన, ప్రైదిప్తాడెబర్మాన్(వరంగల్ కిట్స్), బి.భూమిక, ఎ.అఖిల (యూసీపీఈ) ఉన్నారు. టోర్నమెంట్‌కు బొల్లికుంటలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ రవీందర్ మేనేజర్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో 31మంది డీబార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శనివారం నిర్వహించిన డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ వివిధ సెమిస్టర్ల పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతూ 31మంది విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ అయ్యారని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలాదేవి తెలిపారు.



రాయపర్తి బ్యాంకులో కట్ చేసిన లాకర్ (ఫైల్)

అది ఉత్తరప్రదేశ్ బదౌన్ జిల్లాలోని ఓ ఆమ్లెట్ గ్రామం. పేరు కక్రలా. ఇక్కడ 63 ఇళ్లున్నాయి. 300 జనాభా ఉంటుంది. వీరిలో సగానికిపైగా గ్యాస్ వెల్డింగ్ పనిమీదే జీవనం సాగిస్తుంటారు. ఆ పనిలో వీరంతా సిద్ధహస్తులు. ఇప్పుడు ఇదంతా ఎందుకు చెబుతున్నారని అనుకుంటున్నారా? ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వరంగల్ జిల్లా రాయపర్తి ఎస్‌బీఐ చోరీ కేసులో సూత్రధారులు, పాత్రధారులు ఇక్కడివారే. దేశవ్యాప్తంగా పలు చోరీ కేసుల్లో తప్పించుకుతిరుగుతున్న వీరు.. ఇప్పటికీ పోలీసులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు.



వరంగల్ ఖాకీలకు కక్రలా కలవరం

రాయపర్తి ఎస్‌బీఐ బంగారం చోరీలో ఈగ్రామవాసులే కీలకం

'ఖాకీ' సినిమా తరహాలో..

ఖాకీ సినిమాలో దోపిడీ దొంగలను పట్టుకునేందుకు వెళ్లిన పోలీస్ బృందంపై ఆ గ్రామస్తులు మూకుమ్మడిగా దాడి చేస్తారు. వారినుంచి పోలీసులు చాకచక్యంగా తప్పించుకుంటారు. అదే తరహాలో ఈ కక్రలా గ్రామంలోనూ కనిపిస్తుంటుంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో బ్యాంకు లాకర్ల నుంచి 13 కిలోలు దొంగతనం చేసిన కేసులో 2023 జూన్ 30వ తేదీన కక్రలా గ్రామానికి చెందిన అయాజ్, ఆలీ నయీమ్, యూసఫ్ ఖాన్‌ను పట్టుకునేందుకు వెళ్లిన పోలీసులపై అక్కడి గ్రామస్తులు సంఘటితమై దాడికి దిగారు. ఒకానొక దశలో ఆ ముగ్గురు నిందితులు కాల్పులు జరపడంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు వారిని పట్టుకోగలిగారు. ఇలా.. చాలా కేసుల్లో అక్కడికెళ్లిన పోలీసులకు బ్యాంకు దొంగలను పట్టుకోవాలంటే ముచ్చెమటలు పట్టాల్సిన పరిస్థితి ఉంది. కొన్ని సందర్భాల్లో పోలీసుల ప్రాణానికి కూడా ప్రమాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు.



రికవరీ బంగారాన్ని చూపుతున్న సీపీ (ఫైల్)

ఈపల్లెలో సగానికిపైగా కుటుంబాలు గ్యాస్ వెల్డింగ్‌లో సిద్ధహస్తులు

- పెద్దగా చదువుకోకపోయినా దేశవ్యాప్తంగా సంచలన చోరీ కేసుల్లో వీరే కీలకం
- వివిధ రాష్ట్రాల్లోని పలు బ్యాంకుల్లో దోపిడీ.. బంగారంపైనే కన్ను
- అన్నదమ్ములిద్దరినీ పట్టుకుంటేనే భారీ రికవరీ సాధ్యం

సాక్షి ఎక్స్‌క్లూజివ్

సాక్షి, వరంగల్:

వరంగల్ పోలీసులకు ఉత్తరప్రదేశ్‌లోని బదౌన్ జిల్లా కక్రలా గ్రామం సవాల్ విసురుతోంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రాయపర్తి బ్రాంచ్‌లో గత నెల 18న అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన 19 కిలోల బంగారం చోరీ కేసులో ఈ గ్రామానికి చెందిన అన్నదమ్ములు మహమ్మద్ నవాబ్ హసన్, సాజీద్ ఖాన్ కీలక సూత్రధారులు. గ్యాస్ వెల్డింగ్ పనిచేయడంలో అపార ప్రావీణ్యమున్న వీరిలో ఒకడైన సాజీద్ ఖాన్ 2015లో తమిళనాడు కృష్ణగిరి జిల్లా గురుబరపల్లి గ్రామంలోని జాతీయ బ్యాంక్ నుంచి 48 కిలోల బంగారం చోరీ ఘటనలో ప్రధాన నిందితుడు. వీరే కాదు ఈగ్రామంలో 63 ఇళ్లు ఉంటే దాదాపు సగానికిపైగా కుటుంబాలు గ్యాస్ వెల్డింగ్‌లో సిద్ధహస్తులు. నిమిషాల వ్యవధిలోనే గ్యాస్ కట్టర్ సహకారంతో స్టీల్ గ్రిల్స్‌ను కట్ చేస్తారు. ఏటీఎం, బ్యాంకు దొంగతనాల్లో వీరిది అందెవేసిన చెయ్యి. పదో తరగతి వరకు కూడా చదువుకోని వీళ్లు పదేళ్లుగా బ్యాంకు దొంగతనాలు, ఏటీఎం చోరీల్లో ప్రావీణ్యం చూపుతున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పంజా విసురుతూ పోలీసులకే చుక్కలు చూపిస్తున్నారు.



లాకర్ కటింగ్‌కు నిందితులు వాడిన గ్యాస్ (ఫైల్)

బంగారం స్వాధీనం కష్టమేనా?

రాయపర్తి ఎస్‌బీఐ చోరీ కేసులో కీలకంగా వ్యవహరించిన అన్నదమ్ములు మహమ్మద్ నవాబ్ హసన్, సాజీద్ ఖాన్‌ను పట్టుకునేందుకు వరంగల్ పోలీసులు బృందాలుగా వెళ్లారు. వీరి స్వగ్రామమైన కక్రలాకు కూడా మూడు బృందాలు వెళ్లాయి. మఫ్టీలో వెళ్లిన పోలీసులకు అక్కడి స్థానికులనుంచి సహకారం లేకపోవడంతో వారిని పట్టుకోవడం కష్టతరమవుతోంది. పోలీసుల కదలికలు ఉన్నాయని తెలుసుకున్న వారు తమ గ్రామస్తులను రక్షణ కవచంలా వాడుకుంటున్నారు. అందుకే పోలీసులు చాలా అప్రమత్తంగా వ్యవహరిస్తూ వారిని పట్టుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. వీరిద్దరూ దొరికితేనే పదహారున్నర కిలోల బంగారం రికవరీ అయ్యే అవకాశముంది. ఇప్పటికే ఈ కేసులో ఉత్తరప్రదేశ్ బుడాన్ తాలుకా షేహవాజ్‌పూర్‌కు చెందిన అర్షాద్ అన్సారీ, షాకీర్‌ఖాన్ ఆలియాస్ బోలెఖాన్, మహారాష్ట్ర బుల్దనా జిల్లా మోటల గ్రామవాసి హిమాన్షు బిగాం చండ్ జాన్వర్‌ను అరెస్ట్ చేశారు. వీరినుంచి రెండు కిలోల 520 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇక.. పరారీలో ఉన్న యూపీలోని బదౌన్ జిల్లా కక్రలా గ్రామానికి చెందిన మహమ్మద్ నవాబ్ హసన్, సాజీద్ ఖాన్, మహారాష్ట్ర చికిల్లి తాలుకా సైగావ్ గ్రామవాసి అక్షయ్ గజానన్ అంబోర్, బుల్దానా జిల్లా పునై మోటాల గ్రామం సాగర్ భాస్కర్ గోర్‌ల గురించి ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా వెల్లడించారు.

అవయవదానంతో నలుగురికి జీవితం

ఆడబిడ్డ పుట్టిన వెంటనే శ్రీనితకు తీవ్ర అస్వస్థత

- బ్రెయిన్ డెడ్ అని తెలిపిన వైద్యులు
- మాతృ స్పర్శను ఆస్వాదించకుండానే కన్నుమూసిన బాలింత



శ్రీనిత (ఫైల్)

కాజీపేట: 'ఒక దీపం వెలిగించును వేలకొలది జ్యోతులు. ఒక దీపం చూపించును ప్రగతికి రహదారులు' అన్నాడో కవి. ఓ యువతి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చి అచేతనావస్థకు చేరుకోవడంతో జీవచ్ఛవంలా మారింది. ఆమెను పరీక్షించిన వైద్యులు ఎంత ఖరీదైన వైద్యం చేసినా బతికే అవకాశం లేదని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యుల అంగీకారంతో అవయవదానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపింది. కానీ ఆ యువతి మాతృ స్పర్శను ఆస్వాదించకుండానే కన్నుమూసింది. ఈ విషాద ఘటన కాజీపేటలో శనివారం జరిగింది. బాపూజీనగర్ కాలనీకి చెందిన వశాపాక శ్రీనిత (23) పదిరోజుల కింద ఆడశిశువుకు జన్మనిచ్చి తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. శ్రీనిత ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటికే శ్రీనిత బ్రెయిన్ వాపు వచ్చి కోమాలోకి వెళ్లింది. చికిత్సకు ఆమె స్పందించకపోవడంతో బతికే అవకాశం లేదని, బ్రెయిన్ డెడ్ అని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు కన్నీళ్ల పర్యంతమయ్యారు. పుట్టిన బిడ్డ కనీసం తల్లి స్పర్శకు నోచుకోలేదు. ఇక.. ఎప్పటికీ తిరిగిరాని తమ బిడ్డ మరో నలుగురి జీవితాల్లో వెలుగులు నింపితే చాలని కన్నవాళ్లు, భర్త అవయవదానానికి అంగీకరించారు. శ్రీనిత కళ్లు, గుండె, కిడ్నీలు, లివర్‌లను వైద్యులు శస్త్ర చికిత్స చేసి మరో నలుగురికి అమర్చారు. బిడ్డ పుట్టిందనే విషయం తెల్సి మురిసిపోయిన శ్రీనిత.. ఆ బిడ్డ ఆత్మీయ స్పర్శను ఆస్వాదించకుండానే కన్నుమూసింది. బంధుమిత్రుల అశ్రునయనాల మధ్య శనివారం రాత్రి బాపూజీనగర్‌లో అంత్యక్రియలు పూర్తి చేశారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవాలు



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వేదికపై ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ సారయ్య, మేయర్ సుధారాణి, తదితరులు



ప్రసంగిస్తున్న ఎంపీ కడియం కావ్య, హాజరైన పార్టీ శ్రేణులు, నగరవాసులు

కేయూ క్యాంపస్: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని, గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేయని అభివృద్ధిని పది నెలల్లో తాము చేశామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. శనివారం రాత్రి హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా పాలన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. పశ్చిమ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ముందుకెళ్తున్నట్లు చెప్పారు. వరంగల్‌ను రాష్ట్ర రెండో రాజధానిగా తీర్చిదిద్దేలా సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారన్నారు. ఎయిర్‌పోర్టు, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయబోతున్నారన్నారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాజీపేట వంతెనను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లను సన్మానించారు. కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. వర్ధన్నపేట, పాలకుర్తి, పరకాల ఎమ్మెల్యేలు కేఆర్ నాగరాజు, యశస్వినిరెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నాయకులు అరెపల్లి మోహన్, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బల్దియా జవాన్ మృతి

- అధికారుల వేధింపుల వల్లే గుండెపోటు
- అన్యాయంగా డీజిల్ దందాలో ఇరికించారు
- బల్దియా ఎదుట మృతదేహంతో బంధువుల ఆందోళన



బల్దియా ఎదుట ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య జవాన్ కుటుంబీకులు

వరంగల్ అర్బన్ : గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో డీజిల్ కూపన్ల వినియోగంలో జరిగిన గోల్‌మాల్ వ్యవహారంలో అకారణంగా సస్పెండ్ చేశారని, హైకోర్టు ఆదేశాలను ధిక్కరించారని, ఇటీవల పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టడంతో తీవ్ర మనోవేదనకు గురై జవాన్ కనకం రఘు (50) మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతదేహంతో శనివారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ..బల్దియా పారిశుద్ధ్య జవాన్ రఘు కొన్నేళ్లుగా అధికారులు జారీ చేసిన వాహనాల కూపన్లను డ్రైవర్లకు పంపిణీ చేస్తుండేవారు. 2022లో డీజిల్ కూపన్లలో గోల్‌మాల్ జరిగిందనే ఫిర్యాదుతో అప్పటి కమిషనర్ ఆదేశాలతో సెక్రటరీ, సీఎంహెచ్‌ఓలు విచారణ చేశారు. రూ.35లక్షల నుంచి రూ.40లక్షల వరకు డీజిల్ కూపన్లు పక్కదారి పట్టినట్లు నిర్ధారించారు. దీంతో జవాన్ రఘుకు మెమో జారీ చేసి, 2023 జనవరిలో సస్పెండ్ చేశారు. ఈ కుంభకోణంలో తన పాత్ర ఏమీలేదని, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్, అధికారుల పాత్ర ఉందంటూ రఘు హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో రఘును జైలుకు పంపడంతో ఇటీవల కమిషనర్‌కు హైకోర్టు నుంచి కోర్టు ధిక్కరణ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇదే విషయంపై స్థానిక మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో బల్దియా అధికారులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారించి, కేసు నమోదు చేశారు. రెండేళ్లుగా వేతనం, ఉద్యోగం లేకపోగా, కేసు నమోదు చేయడంతో రఘు తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం గుండెపోటు రావడంతో ప్రైవేట్ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతిచెందాడు. దీంతో బంధువులు.. బల్దియా కార్యాలయం ఎదుట మృతదేహంతో నిరసన వ్యక్తం చేశారు. డీజిల్ దందాలో ప్రమేయం లేకున్నా, కావాలని ఇరికించి ఇబ్బందులకు గురిచేశారని మృతుడి భార్య బుచ్చమ్మ, కుమార్తెలు కన్నీంటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు కుటుంబ సభ్యులతో చర్చించి న్యాయం చేస్తామని, కారుణ్య నియామకం ద్వారా ఒకరికి ఉద్యోగం ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

రూ.1.42లక్షల విలువైన రేషన్ బియ్యం సీజ్

నలుగురిపై కేసు నమోదు



సీజ్ చేసిన రేషన్ బియ్యం

సాక్షి ఎఫెక్ట్

హసన్‌పర్తి : మండలంలోని వంగపహాడ్‌లో అక్రమంగా నిల్వ చేసిన రూ.1,42,480 విలువైన రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న రేషన్ బియ్యం దందాపై సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పందించారు. వంగపహాడ్‌లో ఓ చోట రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయనే పక్కా సమాచారంతో శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 14.2 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు 40.6 క్వింటాళ్ల నూకలు (54.6 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యం దందా చేస్తున్న వంగపహాడ్‌కు చెందిన తెట్టె శ్రీనివాస్, మౌటం రాజు, తెట్టె భిక్షపతి, గోనెల సదానందంపై కేసు నమోదు చేసినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. సీజ్ చేసిన రేషన్ బియ్యాన్ని స్థానిక పోలీసులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వ్యాపారులు తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి..ఎక్కువ ధరకు వాటిని అమ్ముతుంటారని ఏసీపీ చెప్పారు. వంగపహాడ్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి సేకరించిన బియ్యాన్ని ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పవన్‌కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశం మెచ్చిన మన 'చపాట'

- వరంగల్ మిర్చికి దక్కిన జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ట్యాగ్
- తెలంగాణ నుంచి 18వ ఉత్పత్తిగా ప్రత్యేక గుర్తింపు



సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికంగా పండిస్తున్న చపాట మిర్చికి జియోగ్రాఫికల్ ఇండికేషన్స్ ట్యాగ్ (జీఐ ట్యాగ్) లభించింది. ఇప్పటికే తెలంగాణ నుంచి పోచంపల్లి ఇక్కత్, కొండపల్లి బొమ్మలు, కరీంనగర్ సిల్వర్ ఫిలిగ్రీ, నిర్మల్ బొమ్మలు, హైదరాబాద్ హలీమ్ వంటితో పాటు మరికొన్ని భౌగోళిక గుర్తింపు దక్కించుకున్నాయి. తాజాగా ఈరేసులో దేశంలోనే అత్యంత తీపి మిర్చి రకంలో ఒకటైన చపాట వరంగల్ మిరప నిలిచింది. చపాట మిరపకు జీఐ ట్యాగ్ కోసం తిమ్మంపేట మిర్చి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ రెండేళ్ల క్రితం దరఖాస్తు చేయగా.. ఇండియన్ పేటెంట్ ఆఫీస్ (ఐపీఓ) తాజాగా ఆమోదించింది. 'జియోగ్రాఫిక్ ఇండికేషన్స్ జర్నల్'లోనూ చపాట రకం మిర్చికి సంబంధించిన వివరాలు ప్రచురితమయ్యాయి. రెండేళ్ల క్రితం చపాట మిర్చికి వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాకు రూ.లక్ష వరకు ధర పలికింది. తాజాగా జీఐ ట్యాగ్‌తో ఈ రకం మిర్చి ప్రత్యేక గుర్తింపు సాధించినట్లు అయ్యింది.

18వ ఉత్పత్తిగా చపాట..

చపాట మిర్చి.. పొట్టిగా.. లావుగా టమాటను పోలి ఉంటుంది. ఈ రకం మిరపను ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు చాలా కాలంగా పండిస్తున్నారు. డబుల్ పట్టి, సింగిల్ పట్టి, లంబుకాయ, టమాట మిర్చి తదితర పేర్లతో దీన్ని పిలుస్తుంటారు. ఈరకం మిరపలో ఎన్నో ప్రత్యేకతలున్నాయి. ముఖ్యంగా విత్తనోత్పత్తిని రైతులు స్వయంగా చేసుకోవడంతో పాటు పంట సాగులో కూలీల ఖర్చు కూడా ఎంతో తక్కువ. అందుకే చపాట మిర్చిసాగులో రైతులకు పెట్టుబడి ఖర్చు కూడా బాగా కలిసి వస్తోంది. వరంగల్ మిరపకాయ అని కూడా పిలవబడే చపాట మిర్చి రంగు ప్రత్యేకంగా ఉంటుంది. మెక్సికన్ క్యాప్సికమ్‌ను పోలి ఉండే ఈ మిరపను ఉమ్మడి జిల్లాలోని పరకాల, రేగొండ, నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఏటూరునాగారం, ములుగు ప్రాంతాల్లో దాదాపు 15,318 ఎకరాల్లో సాగు చేస్తుంటారు. ఈమిర్చి ఎక్కువ ఎరుపు రంగులో ఉండడంతో పాటు కారం తక్కువగా ఉంటుందని ఉద్యాన విశ్వవిద్యాలయ అధికారులు, మిర్చి రైతులు చెబుతున్నారు. స్కోవిల్లే స్కేల్‌లో ఈ మిరపకాయ ఘాటు తక్కువగా ఉంటుందని తేలింది. ఈ మిర్చిని ఆహారశుద్ధి పరిశ్రమ, రెస్టారెంట్లు, బేవరేజెస్, పచ్చళ్ల తయారీలో అధికంగా ఉపయోగిస్తున్నారు. ఈ మిర్చికి అంతర్జాతీయంగా, మరీ ముఖ్యంగా తూర్పు ఆసియాలో విపరీతమైన డిమాండ్ ఉందని అధికారులు తెలిపారు. ఇందులో అనేక రకాలు ఉన్నాయని పేర్కొంటున్నారు. ఈ మిర్చికి భౌగోళిక గుర్తింపు రావడంతో.. తెలంగాణ నుంచి జీఐ ట్యాగ్ సాధించిన 18వ ఉత్పత్తిగా చపాట వరంగల్ మిర్చి నిలిచింది.



ఆట.. విడుపు

అంతర్జాతీయ మానసిక దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్లికాంబ మనోవికాస కేంద్రం చిన్నారులు ఎంపీ కడియం కావ్య, కొరియోగ్రాఫర్ జ్యోతిరాజ్ సందీప్‌లతో కలిసి శనివారం హనుమకొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద సరదాగా నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, సంస్థ నిర్వాహకురాలు బండా రామలీల, పద్మ, శ్రీనివాసరావు, సదానందం పాల్గొన్నారు. - కాజీపేట అర్బన్

పాకాలలో విదేశీ అతిథులు



వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గంలోని పాకాల సరస్సుకు విదేశీ పక్షుల రాక మొదలైంది. వివిధ రకాల పక్షులు సరస్సుపై వాలడంతో పర్యాటకులు చూడడానికి ఇష్ట పడుతున్నారు. లిటిల్ కార్మోరెంట్ మైక్రోకార్బో నైగర్, ఇండియన్ పాండ్ హెరాన్ ఆర్డియోలా గ్రేయి, ఐబిస్ ఫ్లెగాడిస్ ఫాల్సినెల్లస్ తదితర జాతుల పక్షులు కనువిందు చేస్తున్నాయి. కాలుష్య రహిత సరస్సుగా దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన పాకాల చుట్టూ దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. పచ్చని చెట్లు విదేశీ పక్షుల విడిదికి నిలయం అయ్యాయి. ప్రతీ ఏడాది నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు విదేశీ పక్షుల రాకతో పాకాల సరస్సు ఆహ్లాదాన్ని పంచుతోంది. పాకాల అభయారణ్యంలో ఎత్తయిన చెట్లు ఉండడంతో పాటు సరస్సులోని నీరు స్వచ్ఛంగా ఉండడంతో ఈ ప్రాంతానికి విదేశీ పక్షులు రావడానికి కారణం అవుతుంది.

\- నర్సంపేట











అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు

కాజీపేట అర్బన్ : తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ దర్శనానికి వెళ్లే భక్తులకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్ నడుపుతున్నట్లు ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ పౌర్ణమి సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ వరంగల్ డిపో -1 నుంచి అరుణాచల గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తులకు లగ్జరీ బస్సు సర్వీస్ అందుబాటులో ఉంటుందన్నారు. డిసెంబర్ 13వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు హనుమకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి, డిసెంబర్ 14వ తేదీన ఉదయం 6 గంటలకు కాణిపాకంలో విఘ్నేశ్వరుడిని దర్శించుకుని, మధ్యాహ్నం ఒంటి గంటకు నెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని సాయంత్రం అరుణాచలానికి చేరుకుంటుందని తెలిపారు. డిసెంబర్ 15వ తేదీన గిరి ప్రదక్షిణ అనంతరం డిసెంబర్ 16వ తేదీన జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం దర్శించుకున్న అనంతరం హనుమకొండకు చేరుకుంటుందని వివరించారు. వివరాలకు 9959226056, 9014169807 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లో www.tgsrtcbus.in వెబ్‌సైట్‌లో బుక్ చేసుకోవాలన్నారు. టికెట్ పెద్దలకు రూ. 4,500, పిల్లలకు రూ.3వేలు ఉంటుందని పేర్కొన్నారు.

ఏసీ బస్సులపై 10శాతం రాయితీ

కాజీపేట అర్బన్ : టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల టికెట్ చార్జీపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లహరి, ఏసీ–స్లీపర్, ఏసీ–సీటర్, రాజధాని బస్సులకు డిసెంబర్ మాసంలో 10 శాతం డిస్కౌంట్ బంపర్ ఆఫర్ ఉందని వెల్లడించారు. ఏసీ బస్సులు అందుబాటులో ఉన్న రూట్లకు ఈ ఆఫర్ వర్తిస్తుందని, వివరాలకు 99592 26056 నంబర్‌లో సంప్రదించాలని ఆర్ఎం పేర్కొన్నారు.

కేఎంటీపీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

- మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- 50 గజాల వారికి 75 గజాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు
- కేఎంటీపీకి భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలాల పంపిణీ



మాట్లాడుతున్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, చిత్రంలో వరంగల్ ఎంపీ కావ్య, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారద



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి



మహిళలతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

గీసుకొండ: వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు (కేఎంపీటీ) అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని, ఇక్కడ మౌలిక సదుపాయాలు కల్పిస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం కేఎంటీపీలోని యంగ్‌వన్, కైటెక్స్ కంపెనీల పనుల పురోగతిపై అధికారులు, కంపెనీ ప్రతినిధులతో సమీక్షించారు. అనంతరం పార్కు పైలాన్ వద్ద ఏర్పాటు చేసిన సభలో భూములు ఇచ్చిన రైతులకు ఇంటి స్థలాల కేటాయింపు కార్యక్రమంలో ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడారు. పార్కులో డ్రెయినేజీ సమస్య తీర్చడానికి ప్రభుత్వం రూ. 160 కోట్లు మంజూరు చేసిందని, అంతర్గత రోడ్లు, పచ్చదనం పెంపొందించే పనులు చేపడుతామన్నారు. పార్కు కోసం భూములు ఇచ్చిన రైతుల్లో 186 మందికి కేవలం 50 గజాల చొప్పున స్థలం కేటాయించారని, వారికి 75 గజాల భూమిని ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వం పారదర్శకంగా ఆరు గ్యారంటీలను అమలు చేయడానికి కృషి చేస్తుండగా, ఏడాది పాలనపై ప్రతిపక్షాలు విషప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి మాట్లాడుతుండగా సమావేశంలో పాల్గొన్న కొందరు మహిళలు స్పందిస్తూ మహాలక్ష్మి పథకంతో ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనికి మంత్రి స్పందిస్తూ వారి సమస్యలు కూడా పరిష్కరిస్తామన్నారు. ఉచిత విద్యుత్ విషయంలోనూ కొందరు మహిళలు తమకు వర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ కేంద్రంతో సఖ్యతగా ఉంటూ నిధులు రాబట్టడానికి కృషి చేస్తున్నామన్నారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్లాట్లు కేటాయించిన ప్రాంతాన్ని టౌన్‌షిప్ తరహాలో డ్రెయినేజీ, తాగునీరు, కరెంట్ సదుపాయాలు కల్పించడానికి టెండర్లను పిలిచారని, ఈ నెల 25న పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు.. భూములు ఇచ్చిన ఆరుగురికి ఇంటి పట్టాలు అందించారు. మిగతా రైతులకు అధికారులు డ్రా పద్ధతిలో ఇంటి స్థలాలు కేటాయించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, ఎస్ఎఫ్‌సీ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావుల రాజేశ్వర్‌రావు, 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద, ఆర్డీఓ పోలెం ఉమాదేవి, తహసీల్దార్లు ఎండీ రియాజుద్దీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు. కాగా, గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ గొర్రెకుంట రెవెన్యూ పరిధిలోని హరి హర ఎస్టేట్‌లో రూ. 44 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మించిన బ్రాహ్మణ భవనాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. తెలంగాణ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ సుధారాణి, పరకాల, వర్ధన్నపేట, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేలు ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, రాజేందర్ రెడ్డి, 'కుడా' చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ వాకడే పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



భద్రకాళి దేవాలయంలో కల్యాణంలో భాగంగా తాళిని చూపిస్తున్న అర్చకులు

హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో మార్గశిర శుద్ధ షష్టి శనివారం సుబ్రహ్మణ్యషష్టిని పురస్కరించుకుని శ్రీవల్లిదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు గంగు మణికంఠశర్మ, అర్చకులు ఉదయం నుంచి ప్రాతఃకాలపూజలు ఉత్తిష్టగణపతికి ఆరాధన రుద్రేశ్వరస్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అలయ నాట్యమండపంలో శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి అభిషేకాలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు తలంబ్రాలు అందజేశారు. కల్యాణోత్సవంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు పాల్గొని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని సర్పదోష, రాహుకుజ దోష నివారణ జరగాలని పూజలు చేశారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ దేవాలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు.

భద్రకాళి ఆలయంలో..

సుబ్రమణ్యషష్టిని పురస్కరించుకుని పలు దేవాలయాల్లో సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. భద్రకాళి దేవాలయంలో శ్రీవల్లి దేవసేన సుబ్రమణ్యస్వామి వారికి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ శేషుభారతి పర్యవేక్షించారు. ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరీ దేవాలయంలో సుబ్రమణ్యస్వామి వారికి అరటిపండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎక్సైజ్‌కాలనీ గణపతి దేవాలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజలు జరిపారు.

పురాతన శాసనాలు ఆస్తి వారసత్వ సంపద

- ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ స్వామినాథన్



సమావేశంలో మాట్లాడుతున్న స్వామినాథన్

కేయూ క్యాంపస్: పురాతన శాసనాలు జాతి ఆస్తి వారసత్వ సంపద అని ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జనరల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.స్వామినాథన్ అన్నారు. శనివారం కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో సెనేట్ హాల్‌లో 49వ ఎపిగ్రాఫికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, 43వ ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా వార్షిక కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శాసనాల్లో నాటి రాజకీయ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక సమాచార నిక్షిప్తం అయి ఉందన్నారు. భూ సంస్కరణలు ఆనాడే ఉన్నట్లు కూడా గ్రహించవచ్చన్నారు. యువ విద్యార్థులు ఎపిగ్రాఫికల్‌పై దృష్టి సారించాలన్నారు. ప్లేస్‌నేమ్ సొసైటీ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ ఆచార్య సుస్మిత మజుందార్ మాట్లాడుతూ 1978 నుంచి ప్లేస్‌నేమ్ సొసైటీ ఆఫ్ ఇండియా వివిధ పరిశోధనలు, అకడమిక్ చేస్తుందన్నారు. భారతదేశంలోని ప్రదేశాల పేర్లలో సామాజిక ఆర్థిక చరిత్ర దాగి ఉందన్నారు. మనసాహిత్యం పురావస్తు శాస్త్రాలు వెల్లడించాయన్నారు. ప్లేస్‌నేమ్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జర్నల్స్‌ను అశోక ది మోనార్క్ పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. సభకు కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించగా హిస్టరీ విభాగం అధిపతి డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్ స్వాగతం పలికారు. సోషల్ సైన్స్ డీన్ ఆచార్య టి.మనోహర్ వందన సమర్పణ చేశారు. కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్ అధ్యాపకులు, పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అభిజ్ఞాన్ 3.0 వేడుకలు



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

హసన్‌పర్తి : హసన్‌పర్తి మండలం అన్నాసాగరం శివారులోని ఎస్సార్ యూనివర్సిటీ ప్రాంగణంలో ఉన్న సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అభిజ్ఞాన్ 3.0 వేడుకలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు సైబర్ నేరాలకు గురికాకుండా స్వీయ రక్షణ చేసుకోవాలన్నారు. సైబర్ సెక్యూరిటీ ఇంజనీర్ రూపక్ వోలేటి మాట్లాడుతూ నెట్ వర్క్ సెక్యూరిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు మెమెంటోలు అందజేశారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాము, మహేందర్, వాణిశ్రీ, సుదర్శన్, ఏఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

రూ.5 లక్షల అప్పివ్వలేదని హత్య

- బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- నిందితుడు మాజీ సర్పంచ్, గతంలో ఓ యూట్యూబర్, ఓ ప్రజాప్రతినిధికి పీఏ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ నందిరాంనాయక్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

రామన్నపేట : రెండు నెలల క్రితం జరిగిన పరిచయం కాస్త నిత్యం మద్యం సేవించేంత సన్నిహితంగా మారింది. చివరికి అడిగిన రూ.5 లక్షల అప్పు ఇవ్వలేదన్న కోపంతో ఒంటిపై ఉన్న బంగారం అయినా దోచుకోవాలనే పథకం పన్ని మద్యం మత్తులో దింపి రోకలిబండతో మోది హత్య చేశాడు. వరంగల్ నగరంలో ఈ నెల 2న బ్యాంకు రిటైర్డు ఉద్యోగి రాజమోహన్(62) హత్య కేసు నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. శనివారం ఏసీపీ నందిరాంనాయక్ కేసు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కోమటిపల్లికి చెందిన జక్కుల శ్రీనివాస్.. హనుమకొండలోని రెవెన్యూ కాలనీలో అద్దె నివాసంలో మణెమ్మ అనే మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. రెండు నెలల క్రితం ఓ సెల్‌ఫోన్ దొరకడంతో దానిని అప్పగించే క్రమంలో రిటైర్డు బ్యాంకు ఉద్యోగి రాజమోహన్‌తో పరిచయం ఏర్పడింది. రాజమోహన్ భార్య కరోనా సమయంలో చనిపోవడం, ఇద్దరి కూతుళ్లలో ఒకరు అమెరికాలో, మరొకరు హైదరాబాద్‌లో ఉంటుండగా ఒంటరి జీవనం సాగిస్తున్న అతను.. నిందితుడి శ్రీనివాస్‌తో తన సాదకబాధకాలు చెప్పుకునేంత దగ్గరి చనువు పెరిగింది. తరచూ శ్రీనివాస్, రాజమోహన్ కలిసి మద్యం తాగే వారు. ఈ క్రమంలో శ్రీనివాస్ రూ.5లక్షలు అప్పుగా ఇవ్వాలని రాజమోహన్‌ను అడిగాడు. అందుకు తను సరే చూద్దాంలే.. 'ప్రస్తుతం నా దగ్గర అంత డబ్బు లేదు.. నేను ఇవ్వలేనను' అని చెప్పాడు. స్థానికంగా తనకు ఎవరూ లేరని, రాజమోహన్ ఒంటిపై వేసుకునే లక్షలాది రూపాయల విలువైన బంగారాన్ని ఎలాగైనా దోచుకోవాలనే ఆశతో రాజమోహన్‌ను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 2వ తేదీన శ్రీనివాస్ తాను కిరాయికి ఉంటున్న ఇంటికి రాజమోహన్‌ను పిలిచి మద్యం తాగారు. ఈ క్రమంలో రోకలిబండతో రాజమోహన్ తలపై తీవ్రంగా కొట్టి చంపాడు. కాళ్లను కుక్క గొలుసుతో, చేతులను దండం తాడుతో.. మెడను తువ్వాలతో కట్టి గోనె సంచిలో మృతదేహాన్ని కారులోకి వెనుక సీటులో వేశాడు. మృతదేహాన్ని నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకెళ్లి చివరకు 3వ తేదీ ఉదయం 3.42 గంటల సమయంలో రంగంపేటలో వదిలివెళ్లాడు. అక్కడినుంచి ఆటోలో ఇంటికి వెళ్లిన నిందితుడు ఎలాంటి ఆధారాలు లేకుండా కడిగి వేశాడు. మృతుడికి సంబంధించిన మొబైల్ ఫోన్‌ను సైతం దాచాడు.

సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తింపు..

శ్రీనివాస్ గతంలో యూట్యూబ్ చానల్ నిర్వహించాడు. ఓ ప్రజాప్రతినిధి పీఏగా, సర్పంచ్‌గా విధులు నిర్వర్తించాడు. క్రైం పార్టీ పోలీసులతోపాటు నాలుగు ప్రత్యేక బృందాలు ఘటన స్థలంలో లభించిన సీసీ ఫుటేజీతోపాటు ఫోన్ కాల్ డేటా ఆధారంగా నిందితుడు శ్రీనివాస్‌గా గుర్తించారు. పక్కా ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకుని సెల్‌ఫోన్, బ్రాస్లెట్, చైన్, మూడు ఉంగరాల తోపాటు నాలుగున్నర తులాల బంగారం ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, ఎస్సైలు నవీన్, సాంబయ్య, విశాల్, లచ్చయ్యతోపాటు క్రైం పార్టీ సిబ్బందిని ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.

ఆ రోజు ఏం జరిగింది?

- మిస్టరీగా వాజేడు ఎస్సై ఆత్మహత్య
- హరీశ్ బలవన్మరణానికి యువతే కారణమా?
- ఇప్పటి వరకూ వివరాలు వెల్లడించని పోలీసులు

ములుగు : వాజేడు ఎస్సై హరీశ్ ఆత్మహత్యకు గల ప్రధాన కారణాలను పోలీసులు ఇప్పటి వరకూ వెల్లడించలేకపోతున్నారు. ఎస్సై ఆత్మహత్య రోజు ఏమి జరిగిందనే అంశం మిస్టరీగా మారుతోంది. నల్లగొండ జిల్లా చిలుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ తండాకు చెందిన యువతి బ్లాక్ మెయిలింగ్ కారణంగానే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడ్డాడనే వార్తలు వెలువడుతున్నాయి. దీంతోపాటు మరేమైన బలమైన కారణాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసు యంత్రాంగం రహస్యంగా వివరాలు సేకరిస్తోంది. సదరు యువతి ఈ నెల 1వ తేదీన ఎస్సై హరీశ్ కోసం వచ్చినట్లు ఆధారాలతో పూర్తి సమాచారం ఉంది. ఈ క్రమంలో ఫెరిడోస్ రిసార్ట్‌లోని ఓ గదిలో ఎస్సై ఆత్మహత్య అనంతరం సదరు యువతిని పోలీస్ శాఖతో పాటు ఇతరులు గమనించారు. దీంతో ఎస్సై హరీశ్ ఆత్మహత్య ఘటనలో ఆమె ప్రధాన కారణమా లేక ఇతర విషయాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. హరీశ్ చనిపోక ముందు రోజు యువతితో మాట్లాడే క్రమంలో ఒత్తిడికి లోనై స్నేహితులకు ఫోన్ చేశారు. దీంతో ఓ స్నేహితుడు రిసార్ట్‌కు చేరుకుని యువతితో మాట్లాడి ఆమెను ఒప్పించినట్లు సమాచారం. సమస్య సద్దుమనిగినట్లు భావించిన ఎస్సై హరీశ్ స్నేహితుడిని వెళ్లిపోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో అతను అక్కడి నుంచి బయలుదేరి ములుగు చేరుకున్నాడు. తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో నిద్ర నుంచి లేచిన సదరు యువతి.. ఎస్సైతో గొడవకు దిగినట్లు సమాచారం. దీంతో మరోసారి ఒత్తిడికి లోనైన హరీశ్ ఫోన్ ద్వారా స్నేహితుడిని సంప్రదించాడు. అప్రమత్తమైన స్నేహితుడు ములుగు నుంచి బయలుదేరి వాజేడుకు చేరుకోకముందే ఎస్సై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

ఆ కానిస్టేబుల్ ప్రైవేట్ వెహికిల్ ఎందుకు నడిపారు?

వాజేడు ఎస్సై ఆత్మహత్యకు పాల్పడడానికి ప్రధాన కారణంగా తెలుస్తున్న సదరు యువతి ఈనెల 1వ తేదీ వాజేడు పోలీస్ స్టేషన్ ముందు నుంచి ఎస్సై హరీశ్‌కు కాల్ చేసింది. ఈ క్రమంలో ఓ ప్రైవేట్ వెహికిల్ ద్వారా ఆమెను రిసార్ట్‌కు పంపించారు. అయితే ఈ వాహనాన్ని నడిపిన వాజేడు పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ ఎవరు అనే అంశం ఇప్పటికీ తెలియడం లేదు. చివరికి ఆ యువతిని రిసార్ట్‌లో డ్రాప్ చేసిన అనంతరం రెండు, మూడు సార్లు సదరు వ్యక్తి ప్రైవేట్ వాహనంలో కనిపించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.

క్రీడాస్ఫూర్తితో లక్ష్యాన్ని ఛేదించాలి : సీపీ



ట్రోఫీ అందజేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝూ

వరంగల్ స్పోర్ట్స్ : గెలుపోటములను సమానంగా స్వీకరించే క్రీడా స్ఫూర్తితో యువత అనుకున్న లక్ష్యాన్ని ఛేదించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝూ అన్నారు. వరంగల్ జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30 నుంచి హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్‌లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి మెన్స్ టెన్నిస్ పోటీలు శనివారం ముగిశాయి. వరంగల్ క్లబ్ సీనియర్ క్రీడాకారుడు దివంగత శ్రీనివాస్‌గౌడ్ స్మారకార్థం నిర్వహించిన పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 102 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సింగిల్స్, డబుల్స్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. చివరి రోజు డబుల్స్ కేటగిరీలో మహారాష్ట్ర, తమిళనాడు మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో మహారాష్ట్ర క్రీడాకారులు అనూప్ బంగార్గి, షెట్టి నీరవ్‌ల జట్టు (6-7(3), 6-4, 10-5) స్కోరుతో తమిళనాడు జట్టు ఓజెస్ థేజో, ఏ.దీపక్‌లపై విజయం సాధించారు. సింగిల్స్‌లో మహారాష్ట్ర క్రీడాకారుడు ప్రసాద్ ఇంగలే (7-5, 6-0) స్కోరుతో ఢిల్లీకి చెందిన పార్థ్ అగర్వాల్ పై గెలుపొందాడు. ముగింపు వేడుకలకు సీపీ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, రూ.2.50 లక్షల నగదును అందజేశారు. ఈ సందర్భంగా సీపీ అంబర్‌కిషోర్‌ఝూ మాట్లాడుతూ క్రీడలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే కాదు, స్మారక టోర్నమెంట్లతో క్రీడాకారుల్లో ఐక్యతను చాటుతాయని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సెక్రటరీ మనోహర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కన్నారెడ్డి, ఉపాధ్యక్షుడు ఎల్లా మురుగున్, పీవీ వెంకటేశ్వర్‌రావు, వరంగల్ క్లబ్ సెక్రటరీ రవీందర్‌రెడ్డి, వరంగల్ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, టెన్నిస్ సంఘం బాధ్యులు రాజేశ్వర్‌రావు, ప్రవీణ్‌రెడ్డి, ప్రభాకర్‌రావు, పురుషోత్తంరెడ్డి, గోపాల్‌రావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.